క్లుప్తంగా

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గంలో స్థానం


మోదుగు ఆశీర్వాదం

తల్లాడ: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని పినపాకకు చెందిన తొలితరం ఉద్యమకారుడు మోదుగు ఆశీర్వాదం నియమితులయ్యారు. ఆయన మంగళవారం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆశీర్వాదంను పలువురు అభినందించగా, ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

తల్లాడ విద్యుత్ ఏఈగా ప్రసాద్

తల్లాడ: తల్లాడ సెక్షన్ విద్యుత్ శాఖాధికారిగా రాయల ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రసాద్ గతంలో ఖమ్మం కనస్ట్రక్షన్ విభాగంలో పనిచేసి బదిలీపై ఇక్కడ కొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థికసాయం

మధిర: మండలంలోని మడుపల్లి గ్రామానికి చెందిన ఏసుపోగు మరియమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమె వైద్యఖర్చుల నిమిత్తం మడుపల్లి హరిజనవాడ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది మంగళవారం రూ. 4 వేలు ఆర్థికసాయం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు లింగంపల్లి అప్పారావు, ఉపాధ్యాయులు కేవీ కృష్ణారెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కనకపుడి నరేంద్ర కుమారి ఉన్నారు.

30 వరకు ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు

కల్లూరు: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈనెల 30 వరకు అపరాధ రుసుముతో గడువు ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక విజ్ఞాన్ విద్యానికేతన్ పాఠశాల ఏఐ కోఆర్డినేటర్ ఎస్‌కె.ఇస్మాయిల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9985835115, 7093554882 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కండి..

సత్తుపల్లి: రవాణా రంగాన్ని విచ్ఛిన్నం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, దీనికి కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జాతీయ నాయకులు ఏఎం సాయిబాబా అన్నారు. సత్తుపల్లిలోని కార్మిక సంఘాల నాయకులను మంగళవారం కలిసి మాట్లాడారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, చలమాల విఠల్, సర్వేశ్వరరావు, కిషోర్, హరి, శ్రీను, ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

భోజన కార్మికుల ఆందోళన

సత్తుపల్లిరూరల్: మధ్యాహ్న భోజన పథకం ధరలను బహిరంగ మార్కెట్‌లో ధరలకు అనుగుణంగా పెంచాలని ఏఐటీయూసీ, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర నాయకులు నిమ్మటూరి రామకృష్ణ కోరారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి తెలగారపు రామారావు, నాయకులు తడికమళ్ల యోబు, కార్మికులు ఉన్నారు.

చీరలు పంపిణీ

కారేపల్లి: మండలంలోని నిరుపేద మహిళలకు దీపావళి పండుగ సందర్భంగా జామే మసీదు మాజీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు షేక్ గౌసుద్దీన్ మంగళవారం చీరలు పంపిణీ చేశారు. సోమందుల రాములు, ఖలీలుల్లాఖాన్, వెంకటమ్మ పాల్గొన్నారు.

నాగేంద్రస్వామికి పూజలు

మధిర: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీ అభయ నాగేంద్రస్వామికి అర్చకులు శ్రీనివాసుల శేషాచార్యుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కపిలవాయి జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వర్గీకరణ చేయకుంటే తీవ్ర పరిణామాలు

సత్తుపల్లిరూరల్: వర్గీకరణ చేయకుంటే రాష్ట్రంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కొక తప్పదని, సీఎం రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తప్పుదోవ పటిస్తూ కమిటీల పేరుతో కాలక్షేపం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ కొల్లమండల ముత్తారావు అన్నారు. స్థానిక సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయం ఆవరణలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు నల్లంటి అశోక్, గోళ్లమూడి శ్రీనివాసరావు, లక్ష్మణ్, రాఘవ, దేవన్న, రాంబాబు, కొమరయ్య, రమేష్ పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇచ్చేలా లేవు..!



నిరుపయోగంగా ఎత్తిపోతల పథకాలు
- బీళ్లుగా మారిన సాగు పొలాలు
- వృథాగా లక్షలాది రూపాయల ప్రజాధనం
- రైతులకు తప్పని తిప్పలు


నిరుపయోగంగా మారిన బ్రాహ్మణపల్లి ఎత్తిపోతల పథకం (ఇన్‌సెట్) కాలిపోయిన మోటార్లు

బోనకల్: లక్షలాది రూపాయల వ్యయంతో రైతుల పొలాలకు నీరందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. మండలంలోని సీతానగరం, బ్రహ్మణపల్లి, నారాయణపురం గ్రామాల్లో 20 ఏళ్ల క్రితం లిఫ్టులు నిర్మించారు. సీతానగరంలో 200 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.10 లక్షల వ్యయంతో లిఫ్టు, పైపులైన్లు, మోటార్లు బిగించారు. వేసిన కొద్ది రోజులకే పైపులైన్లు లీకేజీ ఏర్పడంతో పొలాలకు నీరందలేదు. క్రమేణా మోటార్లు కూడ మరమ్మతులకు గురవ్వడంతో రైతులు పంటల సాగు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగులకు మోటార్లు అమర్చి పైపులు వేసి నీరు పెట్టుకోవాల్సి వస్తుంది. పొలాలు వాగులకు దూరంగా ఉన్నవారు సాగుచేయడం లేదు. అధికారుల చుట్టూ రైతులు తిరిగినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో పొలాలు బీళ్లుగా మారాయి.

నారాయణపురం గ్రామంలో దళితుల పొలాలకు నీరందించే లక్ష్యంతో రూ.5 లక్షల వ్యయంతో లిఫ్టు నిర్మించారు. పైపులైన్లు నాసిరకమైనవి వేయడంతో కొద్ది రోజులు మాత్రమే నీటి సరఫరా జరిగింది. ఆ తరువాత లిఫ్టు అలంకారప్రాయంగా మారడంతో 100 ఎకరాల పంట భూములు బీళ్లుగా మారాయి. బ్రాహ్మణపల్లి గ్రామంలో రూ.8 లక్షల వ్యయంతో నాడు ఏర్పాటు చేసిన లిఫ్టుకు సంబంధించి షెడ్ శిథిలావస్థకు చేరుకుంది. మోటార్లు కాలిపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. గ్రామాల్లో రైతుల కోసం ఏర్పాటుచేసిన లిఫ్టులు ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో అవి అలంకరప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి లిఫ్టులకు మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు..



లిఫ్టు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో కొంత కాలం రైతులంతా చందాలు వేసుకొని మరమ్మతులు చేయించాం. అధికారులు పట్టించుకోక లిఫ్టు ఉపయోగంలో లేదు. నాడు నాసిరకంగా పనులు చేయడం వలన పైపులైన్లు పగిలి అస్తవ్యస్తంగా ఎత్తిపోతల పథకం మారింది.

– దామాల బాబు, రైతు, బ్రాహ్మణపల్లి

మరమ్మతులు చేయించాలి..



ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు నిర్వహించి రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలి. నాసిరకంగా నాడు పనులు నిర్వహించినందునే లిఫ్టు ఉపయోగంలో రాకుండ పోయింది. పొలాలన్ని బీడుగా మారాయి.

– జిత్రిపోతుల రవీందర్, మాజీ సర్పంచ్ బ్రాహ్మణపల్లి

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్


కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్

వైరా: రాష్ట్ర ప్రభుత్వం పేదల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం 33 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, 34 మంది సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలందరికీ కన్నీళ్లు, కష్టాలు ఉండవని, సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, పాలేటి నర్సింహరావు, రాంపూడి రోశయ్య, బొళ్ల గంగారావు, సూర్యదేవర శ్రీధర్, తహసీల్దార్ కేవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు: మండల పరిధిలోని రాయమాదారంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సాగర్ కాల్వపై ఇరుకు వంతెన గురించి తెలిపారు. మార్చి నెలలో పనులకు శ్రీకారం చుట్టనున్నట్టు తెలిపారు. ముక్తి లక్ష్మీనారాయణ, నన్నె ఖాన్, గౌస్‌ఖాన్, జక్కంపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న బెటాలియన్ అధికారులు

సత్తుపల్లిరూరల్: అన్ని దానాలలో కన్న రక్తదానం గొప్పదని, రక్తదానం చేయటంతో ఎందరినో ప్రాణాలపాయాల నుంచి కాపాడినట్లేనని బెటాలియన్ కమాండెంట్ పీజే.పీసీ చటర్జీ అన్నారు. మండల పరిధిలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఆధ్వర్యంలో పోలీస్ ఫ్లాగ్‌డే-2024 దినోత్సవాన్ని పురస్కరించుకొని బెటాలియన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బంది, అధికారులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.డి.రంగారెడ్డి, సత్తుపల్లి సీహెచ్‌సీ ప్రభుత్వ ఏరియా వైద్యులు పి.రాజేష్, ఆస్పత్రి సిబ్బంది, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేపపిల్లలను సద్వినియోగం చేసుకోవాలి


కారేపల్లి: చేపపిల్లలను పంపిణీ చేస్తున్న అధికారులు


ఏన్కూరులో..

కారేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న చేపపిల్లలను మత్స్యసహకార సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విశ్వప్రసాద్, ఎంపీడీఓ సురేందర్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. మండలంలోని 24 మత్స్యశాఖ సంఘాలకు గాను, 57 చెరువులకు 68,860 చేప పిల్లలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇన్‌చార్జ్ ఎఫ్ఓ దొంతు సరిత, లక్ష్మణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు: మండల పరిధిలోని గార్లఒడ్డు, సూర్య తండా, ఏన్కూరు, కేసుపల్లి, నాచారం గ్రామాల్లో వైరా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారు. తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఎంపీడీఓ సకినాల రమేష్, ఎంపీఓ జీవీఎస్ నారాయణ, అధికారులు గ్రీష్మ, రాజేష్, ఫీల్డ్‌మాన్ లయిపతి, రమణ, రాము పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా కమిటీలు వేయాలి


చింతకాని: మాట్లాడుతున్న నాగేశ్వరరావు

చింతకాని: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కమిటీలతోనే ఎంపిక చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినందున రాజకీయాలకు అతీతంగా కమిటీలను వేస్తే లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం పార్టీ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులకు అన్యాయం జరిగితే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేసేందుకు వెనకాడమన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, చింతలచెర్వు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు వత్సవాయి జానికిరాములు, తోటకూరి వెంకటనర్సయ్య, బల్లి వీరయ్య, దేశబోయిన ఉపేందర్, గడ్డం రమణ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు..

కారేపల్లి: ప్రజా వ్యతిరేక విధానాల పై ప్రజా ఉద్యమాలు తప్పవని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో దాసరి మల్లయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. మండల కార్యదర్శి కె నరేందర్, వజ్జా రామారావు, బన్సిలాల్, తేజావత్ చందర్, సైదులు, బాలు, పుల్లయ్య పాల్గొన్నారు.

'రైతునేస్తం'తో ఉపయోగం


మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

ముదిగొండ: రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మధిర ఏడీఏ విజయచంద్ర అన్నారు. మాధాపురం రైతువేదికలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వరి, పత్తి పంటలో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ఆయన వివరించారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఓ నారాయణ, ఏఈఓలు మౌనిక, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సెమీ రెసిడెన్షియల్స్‌గా అభివృద్ధి చేయాలి

వైరా: గ్రామీణ ప్రాంతాల్లో విశాల ప్రాంగణం కలిగిన పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్స్ పాఠశాలలుగా అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరాలోని బోడేపూడి భవన్‌లో మంగళవారం నిర్వహించిన స్టడీసర్కిల్ సమావేశంలో ఆయన మట్లాడారు. గురుకుల పాఠశాలలో మెరుగైన వసతులు, గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్స్‌గా మారిస్తే విద్యా వికేంద్రీకరణ అందుబాటులో ఉంటుందన్నారు. స్టడీ సర్కిల్ వ్యవస్థాపక సభ్యులు చంద్రశేఖర్‌బాబు, మాజీ ఎంపీపీ బొంతు సమత, సుధాకర్, తోట నాగేశ్వరరావు, మధు, రామకృష్ణ పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంటను తీసుకెళ్లేది ఎలా?


ఆందోళన చేస్తున్న రైతులు

వేంసూరు: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో అధికారులు, కాంట్రాక్టర్ తీరుతో పొలాల్లోకి వెళ్లే దారి కనుమరుగైందని, ప్రస్తుతం చేతికొచ్చిన పంటను ఎలా తీసుకెళ్లాలని వేంసూరుకు చెందిన పలువురు రైతులు ప్రశ్నించారు. ఈ మేరకు హైవే నిర్మాణ సామగ్రి చేరవేస్తున్న వాహనాలను మంగళవారం అడ్డుకుని నిరసన తెలిపారు. వరికోత మిషన్లు పొలాలకు వెళ్లే దారి లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. దీంతో అధికారులు కాంట్రాక్టర్‌తో చర్చించగా, రైతుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. రైతులు రమేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

సత్తుపల్లిరూరల్: గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కాకర్లపల్లి బోడు కాలనీలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ సిహెచ్‌పి అనిత, ఏఎన్ఎం మంజుల, ఆశాకార్యకర్తలు జయమ్మ, రాధా, కుమారి పాల్గొన్నారు.

'గ్రాండ్ హెల్త్ చాలెంజ్' ప్రారంభం


వైద్యశిబిరంలో ఆర్టీసీ, వైద్య సిబ్బంది

మధిరరూరల్: ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యం కోసం సంస్థ ప్రవేశపెట్టిన గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కార్యక్రమాన్ని మంగళవారం మధిర డిపోలో డిపో మేనేజర్ డి.శంకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ వైద్య శిబిరం మూడు రోజులు పాటు కొనసాగుతుందని, ఉద్యోగి భార్య లేదా భర్త సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

'మా భూములకు రక్షణ కల్పించండి'

చింతకాని: వ్యవసాయ భూములకు రహదారి లేకుండా చేయడమే కాక తప్పుడు కేసులు పెట్టిన రైతుపై చర్యలు తీసుకుని, తమ భూములకు రక్షణ కల్పించాలని రైతులు కనపర్తి రంగనాయకమ్మ, బోయపాటి సీతారావమ్మ పోలీస్, రెవెన్యూ అధికారులను కోరారు. మండలంలోని అనంతసాగర్‌లో మంగళవారం వారు మాట్లాడారు. అనంతసాగర్ రెవెన్యూ పరిధి 271, 272 సర్వేనంబర్లలో వ్యవసాయ భూమి ఉండగా, పూర్వం నుంచి రహదారులు ఉన్నాయని తెలిపారు. అయితే, అన్నదమ్ముల వాటాలైన భూములకు రహదారి లేకుండా చేసేందుకు కనపర్తి గోవిందరావు ఫెన్సింగ్ రాళ్లు వేస్తుండగా అడ్డుకోవడంతో తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారన్నారు. తప్పుడు సర్వే నంబర్ల ద్వారా తమను వేధిస్తున్న విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

అంకితభావంతో పనిచేయాలి

మధిర: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల మన్ననలు పొందాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు కోరారు. యూనియన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్ బ్రహ్మారెడ్డి అధ్యక్షతన మంగళవారం మధిర టీవీఎం పాఠశాల ఆవరణలో మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాల నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ మేటర్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కె.వెంకట నరసయ్య, సీహెచ్ వి.రవికుమార్, ఎండి.జమీర్, డి.వెంకటేశ్వరరావు, తూమాటి కృష్ణారెడ్డి, కొమ్ము శ్రీనివాసరావు, సంగిరెడ్డి, నాగరాజు, చిలుకూరు సత్యనారాయణరెడ్డి, పోలె సుధాకర్, మదన్‌మోహన్ రెడ్డి, బాలకృష్ణ, కొలగాని ప్రసాదరావు, పిల్లి నరసింహారావు, లింగంపల్లి అప్పారావు, జ్యోతి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా


ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

మధిర: ఎల్ఐసీ ఏజెంట్లకు, పాలసీదారుల మనుగడకు మేనేజ్‌మెంట్ విఘాతం కల్పిస్తుందని ఆరోపిస్తూ ఏజెంట్లు, పాలసీదారులు మంగళవారం ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లియాఫియా అధ్యక్షుడు ఎస్‌కె.జానీమియా, కార్యదర్శి కృష్ణారెడ్డి మాట్లాడుతూ... ఏజెంట్లు, పాలసీదారులు ఉద్యమం చేయకపోతే రాబోయే రోజుల్లో సంస్థ కూడా పోస్టల్ ఏజెన్సీ మాదిరిగా కనుమరుగవుతుందన్నారు. డివిజన్ బాధ్యులు ఏవి నర్సిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శివకృష్ణ, దస్తగిరి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి పంచాయతీలో మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నాయకులు మర్సకట్ల బాలరాజు, మచ్చా వెంకటేశ్వరరావు, వేమిరెడ్డి వెంకటరెడ్డిలు లబ్ధిదారులైన శ్రీకాంత్‌రెడ్డి, బండి పుల్లయ్య, మాదాసు నాగరాజు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణమూర్తి

కల్లూరు: స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు షార్ట్‌హ్యాండ్‌పై నిపుణులు కోట సత్యనారాయణమూర్తి అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉద్యోగాలైన స్టెనో గ్రాఫర్లు, టైపిస్టు ఉద్యోగాలకు అర్హత సంపాదించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి ఎంతో ఉపకరిస్తుందన్నారు. ప్రతిభ విద్యా సంస్థల డైరెక్టర్ లక్కినేని ప్రసాద్, ప్రిన్సిపల్ రామాల ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట భక్తాంజనేయస్వామి ఆలయం, వేంసూరురోడ్‌లోని శ్రీ మెట్టాంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్తాంజనేయస్వామి ఆలయంలో బోడ రమేష్, శాంతి దంపతులు, ములకలపాటి హేమశ్రీ, మెట్టాంజనేయస్వామి ఆలయంలో గొర్లమారి సంజీవరెడ్డి, అరుణకుమారి, మహిపాల్‌రెడ్డి, సౌజన్య, అభిషేక్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు కాలినేని కాంతారావు, అంకమరాజు, రవీందర్‌రెడ్డి, ప్రసాద్, రజిని, పురుషోత్తం పాల్గొన్నారు.

కుమురం భీంకు ఘన నివాళి


సత్తుపల్లిటౌన్: నివాళులర్పిస్తున్న నాయకులు


పెనుబల్లిలో..

సత్తుపల్లిటౌన్: కుమురం భీం జయంతి వేడుకలను సత్తుపల్లిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకపోడు గిరిజన సంఘం నాయకులు సత్తుపల్లిలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూచి గోవర్ధన్, మారుతి బాబురావు, భోగి వీరాస్వామి, కారం గంగరాజు, కిషోర్, కాసిన రాజులు, రాజేష్, రాజారావు, నరేష్, విష్ణు, మోహన్‌రావు, రవి పాల్గొన్నారు.

పెనుబల్లి: కుమురం భీం విగ్రహానికి అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ గంటా ప్రతాప్, వెంకటేశ్వర్లు, జగన్, రాధా కృష్ణ, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, దామోదర్, రాఘవులు, తిరుపతిరావు ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

కొణిజర్ల: మండలంలోని లాలాపురం సమీపంలోని ఎస్ఏఆర్ రైస్ మిల్లు ఎదుట బుధవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాను రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని రైతు సంఘం మండల బాధ్యుడు దొడ్డపనేని కృష్ణార్జునరావు పిలుపునిచ్చారు. సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అప్పగించకుండా దాదాపు రూ.82 కోట్లను కాజేసిన రైస్ మిల్లును సీజ్ చేసి ధాన్యం రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

వైరా: పోలీస్ అమరవీరుల త్యాగాలు చరిత్రలో చిరస్మణీయంగా మిగిలిపోతాయని ఎస్సై ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పోలీస్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శాంతిభద్రతల పరిక్షణలో పోలీస్ వ్యవస్థ ముందు ఉంటుందన్నారు. లయన్స్‌క్లబ్ బాధ్యులు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, బుచ్చిరామారావు, రమేష్, రాంగోపాల్ పాల్గొన్నారు.

గ్రామానికి దూరంగా టవర్ నిర్మించాలి

చింతకాని: గ్రామంలో ఎట్టి పరిస్థితుల్లో సెల్ టవర్ నిర్మాణాన్ని జరపనివ్వమని, గ్రామానికి దూరంగా సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టాలని మండల పరిధిలోని గాంధీనగర్ కాలనీ గ్రామస్తులు అన్నారు. గ్రామంలో ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన టవర్ నిర్మాణం ఆపాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కూరపాటి అనంతరాజు మంగళవారం నిర్మాణంపై గ్రామస్తుల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు.